


బాబు ఏడుస్తున్నాడు. గుక్కపెట్టి మరీ ఏడుస్తున్నాడు. బాబు ఎందు కేడుస్తున్నాడో నాకు తెలుసు. ఆకలివేసి పాలకోసం ఏడుస్తున్నాడు. ఆయా సముదాయిస్తున్నా వూరుకోవటం లేదు.

నేను నా గదిలో డ్రెస్సింగ్ టేబిలు ముందు కూర్చున్నాను. గది కిరు ప్రక్కలా అమర్చిన ఎయిర్ కూలర్స్ నుంచి చల్లని గాలి సరఫరా అవుతోంది. రివాల్వింగ్ కుర్చీలో కూర్చున్న నన్ను మిస్ రీటా అటూ ఇటూ త్రిప్పుతూంది. ఆమె నాకు హెయిర్ డ్రస్సింగ్ చేస్తోంది ఆమె సిటీ బ్యూటీ క్లినిక్ నుండి వచ్చింది. ఆమె నాకు హెయిర్ డ్రస్సింగ్ చేసి. నేను దుస్తులు ధరించటానికి సహాయ పడు తుంది. నా వంటికి ఏ రంగు చీర సరిపో తుంది? ఆ చీరకు ఏ బ్లౌజు సరిగ్గా అమరు తుందో ఆమె సలహాలిస్తుంది. ఆ చీరకు 'మేచ్' అయే ఇతర ఆభరణాలు అంటే గాజులు. ఇయర్ రింగ్స్. స్లిప్పర్స్ మొద లైనవి ఆమె సెలక్టు చేస్తుంది ఒక మాటలో చెప్పాలంటే ఆమె నన్ను ఒక అందాల బొమ్మగా తయారు చేస్తుంది. అందుకుగాను ప్రతి ఒక గంటకు ఏభై రూపాయలు ఆ కంపెనీ చార్జి చేస్తుంది అదిగాక ఆమెకు టాక్సీ చార్జీలు కూడ ఇవ్వాలి. ఆమె చేసిన అలంకరణ మా వారికి బాగా నచ్చితే (నాకు నచ్చటం, నచ్చక పోవటం అనే ప్రసక్తే లేదు—) వారు ప్లీజయి ఆమెకు పదిరూపాయలు తక్కువ కాకుండా 'టిప్' ఇస్తారు. మిస్ రీటా ఫారెన్ లో ట్రైనింగు ఆయావచ్చింది. ఆమెకీ వృత్తిలో డిప్లమాలున్నాయి సర్టి ఫికెట్లు కూడ వుండే వుంటాయి ఆమెకు ఆ కంపెనీ వాళ్లు నెలకు రెండువేల రూపా యలు జీతమిస్తారు ఆ విషయాలన్నీ ఆమే చెప్పింది.

(....బాబు ఇంకా ఏడుస్తూనే ఉన్నాడు. బాబు ఏడుపు నా చెవుల్లోంచి నా గుండె ల్లోకి గుచ్చుకుంటుంది. కాని నేనేం చేయ గలను? ఆ ఏడుపును మాన్పే శక్తి లేదు నాకు. నేను నిర్భాగ్యురాలను. వాడు గొంతెత్తి ఏడుస్తుంటే ఆ ఏడుపును చూచి నేను లోలోపల కుమిలి కుమిలి ఏడుస్తాను. నా ఆఏడుపు ఎవరికీ వినిపించదు. నా గుండె లకే తెలుసు ఆ ఏడుపు )

నా ముందున్న డ్రస్సింగు టేబులు మీద ఎన్నో 'బ్యూటీ' ఎయిడ్స్ ఉన్నాయి. క్రీములు, లోషన్సు. పౌడరు స్నోలు. లవెండర్సు....ఎన్నెన్నో రకాలు. ఇవి ఎలా లేదన్నా కనీసం రెండు, మూడు

---

నవనాగరికపు మైకంలో పిల్లలయెడ తలితండ్రుల బాధ్యత ఎంతవరకుంది?

భార్య అందవిహీనానికి పిల్లలు కారకులా? అటువంటి వారికి సంతానమెందుకు? సంతానంపై వాత్సల్యాన్ని చూపటంలో మనుషులకంటే పశువులు నయం!

---

వందల రూపాయలకు తక్కువ వుండవు. వీటితో నాకుగా నేను మేకప్ చేసుకో వచ్చును. కాని మా వారికి నేను చేసుకునే మేకప్ గిట్టదు. నవ్వుతారు ఎగతాళి చేస్తారు. మీ నూజవీడులో దసరా పండుగకు వచ్చే బుట్ట బొమ్మలాగా వున్నానని వెక్కిరిస్తారు. ఇలా ఏద్కైనా ప్రత్యేకమైన పార్టీలకెళ్ళేటప్పుడు ప్రత్యేకమైన అలంకరణ కోసం ఈ బ్యూటీ 'స్పెషలిష్టు'కు ఫోనుచేసి పిలిపిస్తారు ఎందుకండి డబ్బులు దండుగ అంటే వినరు.

"నేను ఆడదాన్ని కానా. నా తల నేను దువ్వుకోలేనా? నా చీర నేను కట్టుకోలేనా? తల దువ్వి చీర కట్టినందుకు ఆ ముండకు గంటకు ఏభై రూపాయలా?" అని మొదటి పర్యాయం నేను గుండెలు బాదుకున్నాను.

"డోంట్ బీ సిల్లీ రత్నా! నీవు ఎవరవు? ఆ దర్టీ నూజివీడ్లో కోనేటి నుంచి బిందె చంకన పెట్టి నీళ్లు తెచ్చుకునే ఆ.... రామ రత్నానివి కావు! నీవు ఇప్పుడెవ్వరవు? మిసెస్ రావ్! ఈ సిటీలోనే వున్న పెద్ద పెద్ద కంపెనీలు సగానికి పైగా మనవి. ఆ మాట కొస్తే ఈ స్టేట్‌లో వ్రేళ్ళమీద లెక్క పెట్టకలిగిన ధనవంతుల్లో మనము ఒకళ్ళం! అలాటి రావుజీ మిసెస్ ఇలా మాట్లాడటం—నో నో—ఐ హేట్—"

ఇలా మాటాడి నా నోరు మూయించేస్తారు ఆయన చాలా గొప్ప ధనవంతులే! ఆయనకు డబ్బు విలువ తెలియదు. ఆయనకు తెలిసిందల్లా నా అందం. ఆ అందాన్ని నలుగురు ముందూ ప్రదర్శించటం. పరుల ప్రశంసల కోసం అయనెంతయినా ఖర్చు చేస్తారు—ఏమయినా చేస్తారు!


నా అలంకరణ పూర్తి అయింది. కాని బయట బాబు ఏడ్పు ఆగకుండా సాగుతూనే వుంది.

"యు ఆర్ రియల్లీ ఫైన్ మిసెస్ రావ్! అబ్బ. మీరీ మేకప్‌లో ఎంత అందంగా వున్నారు—కళ్ళు చెదిరి పోయే బ్యూటీ—నిజంగా మిమ్మల్ని 'కిస్' చెయ్యాలనిపిస్తుంది—"

ఫైర్ ————————————

- కస్టమర్ : అయ్యా గంటనుంచి మంచినీళ్ళు అడుగుతున్నాను. ఒక్కరూ యివ్వరేంటి?

  హోటల్ యజమాని: మంచినీళ్ళంటే మా వాళ్ళకు అర్థం తెలియదు. ఫైర్ అని అరవండి




ఇలా నోటి కొచ్చినట్లు వాగి, నేను యిచ్చిన చెక్ తీసుకొని, 'టిప్' కింద మరో అయిదు రూపాయిలు సమర్పించు కున్న తర్వాత రీటా పోయింది.

బాబు చేతుల్లో నిలవకుండా ఏడుస్తు న్నాడు, బాబు అలా ఏడుస్తుంటే వీళ్ళంతా ఏం చేస్తున్నట్లు? ఆయా ఏమయిందో?

నేను కోపంగా విసురుగా బయటికి వచ్చాను, ఆయా బాబు నెత్తుకునే వుంది. టెర్రస్‌లో బాబును సముదాయిస్తూపచార్లు చేస్తూంది నా కోపం చల్లబడింది.

మెల్లిగా అడిగాను. "ఎందుకు ఆయా. బాబు అలా ఏడుస్తున్నాడు?" ఎందు కేడు స్తున్నాడో నాకు తెలుసు—అయినా అడి గాను.

"పాలకోసం అమ్మగారు! బిస్కట్లు పెట్టినా ఏడుస్తున్నారు. పాలుత్రాగే వేళ అయింది." అంది.

"ఆ సీతమ్మ ఇంకా రాలేదా?"

"రాలేదమ్మగారూ—"

"ఈ సీతమ్మ రోజూ ఇలా ఆలస్యం చేస్తుందే! లాభం లేదు, ఈవిడ్ని మాని పించేసి, ఇంకెవర్నయినా చూడాలి—" చిరాకుగా అన్నాను ఈ సీతమ్మను మాని పించేస్తే బాబుకు పాలిచ్చే వాళ్ళెవరూ దొరకరని నాకు తెల్సు.

"బాబూ—నానీ—చూడు—చూడు" అని నేను బాబును సముదాయించటానికి ప్రయత్నించాను. బాబు ఒక్క-క్షణం ఏడ్పుమాని, నా వంక చూచి మొగం

ప్రక్కకు త్రిప్పుకొని మళ్ళీ ఏడవటం మొదలు పెట్టాడు. బాబుకూ తెలుసు, ఈ అమ్మ తన ఆకలి తీర్చే అమ్మకాదని— (వుత్త బొమ్మని) అందుకనే నా వంక కేర్ లెస్‌గా చూచి, నా ఏడ్పు ఏదో నన్నే ఛ్వనీ అన్నట్లు మొగం ప్రక్కకు తిప్పు కొని మళ్ళీ ఏడ్వటం మొదలు పెట్టాడు.

అయినా నా 'అమ్మ' మనస్సు వూరుకో లేదు. జరిగిన అవమానాన్ని పట్టించుకో కుండా "ఇదిగో చూడు బాబు, ఇదిగో ఇది తీసుకో—" అని నా చేతిలో వున్న చెక్ బుక్ ని వాడికిచ్చాను. వాడు దాన్ని చేతితో విసిరి కొట్టాడు. అయ్యో అవన్నీ బ్లాంకు చెక్కులురా.... మీ నాన్నగారుసంత కాలు చేసిన చెక్కులు, వాటన్నిటితో కొన్ని లక్షలు రూపాయలు బ్యాంకునుండి డ్రా చెయ్య వచ్చును వుత్త పిచ్చి సన్నా సివి లాగున్నావేరా? డబ్బంటే లెక్క లేదు— విసిరి పడేశావు. అన్నీ మీ నాన్న గారి పోలికలే వచ్చాయిరా!

వంగొని క్రిందపడ్డ చెక్ బుక్ ను తీసు కుని మరల గదిలోకి వెళ్ళాను. చెక్ బుక్ ను అలమరలో పెట్టుతుండగా అవి పించింది—చెక్ లు, లక్షలు, డబ్బులు— బాబు ఆకలి తీర్చలేవు. వాడి ఆకలి తీర్చే "అమృత ధారలను" పిండలేవు. వట్టి పోయిన ఆవు పొదుగు పిండితే పాలు వస్తాయా? అలాగే! తరగని ధనసంపదా, కార్లు, మేడలు, కళ్ళు చెదరగొట్టే అందం ఎయిర్ కండిషన్డు రూంలు, నౌకర్లు, చాకర్లు, నగలు, చీరలూ, పేరు ప్రతిష్ఠలు ఇన్ని వున్నాయి. ఇన్ని వున్నా నేను బికా రిని, నా కన్నబిడ్డ కడుపాకలి దీర్చలేని కటిక దరిద్రురాలను. వాడాకలితో ఏడ్చి నప్పుడు త్రాగరా తండ్రీ అని 'రొమ్ము' కుడుపలేని పాపిష్టిదాన్ని!

నా గుండెల్లో కుదుళ్ళు కదులు తున్నాయి. నా మనస్సులో కుళ్ళగింపు మొదలయింది. నాకేడ్పు ముంచుకొస్తోంది. నా కనుకొలకుల్లో కన్నీరు వుబికింది.

సేల్స్ టాక్స్—

❋ అమ్మకంమీద పన్ను

(వస్తువులు కొన్నవారి దగ్గరనుంచి అమ్మినవారి ద్వారా ప్రభుత్వం అతి సునాయాసంగా మర్యాదగా వసూలుచేయు పన్ను (నోటీశ్, అలా అయితే ప్రతి వ్యక్తి దగ్గర ముప్పైరెండు పార్లే వసూలు చేయగలరు).

అవి అక్కడే ఆగిపోవాలి. అక్కడే ఇంకి పోవాలి. అక్కడ్నుంచి ఒక్క బొట్టు కూడ క్రింద పడకూడదు. నా బుగ్గల్ని తడుపకూడదు నా మేకప్‌ను చెరప కూడదు. నా భర్త నొచ్చుకుంటాడు. వెళ్ళబోయే పార్టీలో అందరూ 'చిన్న చూపు' చూస్తారు. అది నా భర్త సహించరాని విషయం.... నేను ఏడవ కూడదు. కన్నీరు కార్చ కూడదు. అయ్యో. నేనెంత దౌర్భాగ్యురాల్ని. చాటుగా కన్నీరు కార్చేటందుకు కూడ స్వేచ్ఛలేని బానిసను....ఛీ. ఛీ.- నేను ఏడవ కూడదు. ఎక్కడయినా బొమ్మలు ఏడుస్తాయా? కన్నీరును మళ్ళీ వెనక్కి గుండెల్లోకి లాక్కోవాలి? ఎలా?

....ఇంతలో ఫోన్ మ్రోగింది. వారు చేశారు. "రీటా వచ్చిందా? నీ మేకప్ అయిపోయిందా? ఈ మేకప్‌లో నీవు ఎంత అందంగా వున్నావో? ఎలా వున్నావో నాకు చెప్పవా. రత్నా!" అని ప్రశ్న వెంట ప్రశ్న అడిగారు. 'అరగంటలో వస్తున్నాను. ఈ లోపల 'బాబిగాడ్ని' ఎత్తుకొని మేకప్ అంతా పాడుచేసుకోవద్దు." అని మరీ మరీ చెప్పారు.

అబ్బ. ఈయనకు నేనంటే ఎంత ఇంటరస్టు ఇదంతా నా మీదనా? లేక నా అందం మీదనా?....ఎక్కడ్నుంచో నా హృదయంలోకి మెల్లమెల్లగా బరువు దిగుతుంది— బరువెక్కిన హృదయపు లోతుల్లోంచి ఆలోచనలు మెల్లగా పైకి తేలాయి.... తల దిమ్ముగా వుంది. ఫ్రిజ్‌లోంచి డ్రింకు తీసికొని త్రాగాను. కాస్త రిలీఫ్‌గా వుంది. సోఫాలో కూర్చొని. కళ్ళు మూసుకున్నాను.

—నాలుగు నెలల క్రితం జరిగిన ఆ సంఘటన కళ్ళముందు మెదిలింది. ఆ రోజు ఇంకా నాకు బాగా గుర్తు వుంది. ఆయన కంపెనీ పనుల మీద బొంబాయి వెళ్ళారు నాకు ప్రసవ నొప్పులు వచ్చాయి. డాక్టర్ మాధవీ నర్సింగ్ హోంలో రాత్రి ఏడుగంటలకు బాబును కన్నాను. డాక్టరు మాధవి అప్పటికప్పుడే బొంబాయికి ట్రంక్‌కాల్ బుక్‌చేసి ఈ విషయం

ఇన్‌కంటాక్స్

## * పన్నుపై పన్ను

(ప్రతి వ్యక్తిని సంవత్సరానికోసారి గట్టిగా పళ్ళూడగట్టి పన్ను కట్టించుకొనే పద్ధతి యిది. ధనార్జనాపరులను తమ ముప్పయ్యో ఏటనుండి ముప్పైరెండు మార్లు వరుసగా పళ్ళూడగొట్టుంది ప్రభుత్వం. ఆఖరి పన్ను వూడగొట్టేసరికి పన్నూడగొట్టుకుంటున్న వ్యక్తి వుండనూ వచ్చు లేక పూర్తిగా వూడిపోనూ వచ్చు)

వారికి చెప్పింది. ఆయన ఎంతో సంబర పడి పోయారట. బొంబాయిలో ఆయన కున్న ఎంగేజ్‌మెంట్లు అన్నీ కట్ చేసు కొని రేపు మార్నింగ్ ప్లేన్‌లో వస్తున్నానని చెప్పారట. మాధవి చెప్పింది. రాత్రి పదకొండు గంటలకు నాకు మగతనిడి మెలకువ వచ్చిన తర్వాత.

"మీరంటే మిష్టర్ రావు కెంత ప్రేమండీ" అంది. (నలభై ఏళ్ళు వచ్చినా ఇంకా మిస్ గానే వుండిపోయిన మిస్ డాక్టరు మాధవి. ఒక విధమైన 'జెలసీ' తో.)

తెల్లవారకుండానే ఆయన వచ్చారు. ఎయిర్ పోర్టునుండి బంగళాకు కూడ వెళ్ళకుండా నేరుగా అక్కడికే వచ్చారు. వుయ్యాల తొట్టిలో వున్న బాబును చూచి ఈయన చిన్నపిల్లవాడిలా సంబర పడి పోయారు. నా మనస్సులో తీపిగా ఏదో వులికింది.

తర్వాత ఏదో గుర్తు వచ్చినట్లు కంగారుగా, "అన్నట్లు నీవు బాబుకు పాలిచ్చావా?" అని అడిగారు ఇంకా ఇవ్వ లేదన్నాను. ఆయన తేలిగ్గా గాలి పీల్చి ఇవ్వొద్దు సుమా అని నన్ను హెచ్చరించి డాక్టరు మాధవి రెసిడెన్సీ వయిపు హడావుడిగా వెళ్ళిపోయారు. డాక్టరు మాధవి రెసిడెన్సీ కూడ ఆ కాంపౌండులోనే ఉంది.

ఒక గంట పోయిన తర్వాత సిస్టరొచ్చి నాకు ఇంజెక్షన్ ఇచ్చి, ఏవో టేబిలెట్సు మింగించి వెళ్ళింది. విన్నట్నుంచి మాటి మాటికి ఏవో ఇంజెక్షన్లూ టేబిలెట్సూ ఇస్తూనే వున్నారు. ఇవి కూడ ఆ బాపతే అనుకున్నాను. కాని మర్నాడు తెల్సింది. ఈ ఇంజెక్షన్సు టేబిలెట్సు సహజ సిద్ధంగా నా బాబుతో పాటే నాలో పుట్టిన పాల వూటను ఎండ కట్టటానికి ఇచ్చిన మందు లని. నా మనస్సు వికలమయింది.

ఎంత పనిచేశారు? అసలెందుకిలా చెయ్యవల్సి వచ్చింది? నా బాబు నోటి దగ్గర పాలను తియ్యవల్సిన అవసరం వీళ్ళకెందుకు? ఇంత నీచానికెందుకు వడి గట్టారు?

ఆ దుఃఖంలో నా ఆలోచనలు దేముడి వయిపు మళ్ళాయి. నిజంగా ఆయన ఎంత దయామయుడు? నారుపోసిన వాడే నీరు పోస్తాడన్నట్లుగా పుట్టిన ప్రతి పసిగ్రుడ్డు మొదటిసారిగా నోరు తెరచి తెరవగానే, ఆ పసిగ్రుడ్డు గొంతు తడపడటానికి, ఆ బుజ్జిపొట్ట ఆకలి తీర్చటానికి తల్లి వక్షోజాల్లో పాలచుక్కలు నింపి 'నీ ఆహార మిదిగోరా బుజ్జిగా!' అంటాడు. భూమి మీదకు తీసుకొచ్చావు. ఆకలి తీర్చుకోవటానికి దారి చూపలేదనే నిందను ఆయన తన మీద పడకుండా ఇలా ఆయన తన విధిని ఎంతో నేచురల్‌గా నిర్వహిస్తాడు. నిజంగా. ఇది ఎంత సహజంగా, సున్నితంగా నిర్వహింపబడే ప్రకృతి కార్యం? కాని, 'పొదుగులు' కోసే ఈ మనుషులు


ఆ విధాత పెట్టిన నోటి దగ్గర ఆహారాన్నే తీసేస్తారు.

రెండో రోజు తర్వాత నా భర్తనిఅడిగాను. "ఎందుకిలా చేశారని?"

ఆయన నవ్వారు. నవ్వి, అన్నారు:

"నీ కోసమే. వాడు పాలతోపాటు నీ బ్యూటీనీ తాగేస్తాడు.... నీవు ముసలి దొక్కువు అయిపోతావు... నీవు ఎప్పుడూ ఫ్రెష్‌గా, నలగని పువ్వులాగా అందంగా వుండాలి. నేను గర్వించే నీ బ్యూటి చెడకూడదు. చెదిరి పోకూడదు."

నా మనస్సు ముక్కలు ముక్కలయింది. ఎప్పుడూ నలగని పువ్వులాగా వుండాలి అనుకునే ఆయన అసలు నన్ను తాకకుండా వూరుకో వచ్చుగా! వూరుకున్నాడా? మరి, ఈ బాబు ఎందుకు పుట్టాడు? ఆయన గర్వంకోసం, ఆయన ఆనందం కోసం, నా కిష్టమున్నా లేకపోయినా ఎన్నో చేశాను. చేతులు లేని రవికలు తొడిగాను. వళ్ళంతా ఎక్స్‌పోజు చేసే బట్టలు ధరించాను. పెదాలకు రంగు పూసుకున్నాను. కిట్టమున్నా చీకట్లో, క్లబ్బుల కెళ్ళాను; పార్టీల కెళ్ళాను; బాల్‌ల కెళ్ళాను. ఇది హైక్లాస్ సొసైటీలోని హైక్లాసు నాగరికత అంటా ఆయన పోవగించుకుంటారని నేను లోలోపల సగం చచ్చి, అడ్డమైన వెధవలతో కరచాలనాలు చేశాను. పేదయింట్లో పుట్టి పెరిగిన ఆడపిల్లనయి వుండికూడ ఆయన నాగరిక మన్న ప్రతిదాన్ని అలవర్చుకున్నాను. నా యిష్టా యిష్టాలతో ప్రమేయం లేకుండా, ఆయన కోసం, ఆయన డిగ్నిటీకోసం - ఆయన కోరిన విధంగా ఆయన మనసుకు నచ్చిన తీరులో షో కేసులోని బొమ్మలాగా బ్రతుకుతున్నాను. ఇన్ని....ఇన్ని చేశానే ఈ ఒక్క చిన్న విషయంలో నా కన్న బిడ్డకు తల్లిగా నేను నా పాలిచ్చుకునే పాటి స్వతంత్రం కూడ నాకు లేకుండా పోయింది. ఇన్ని వుండి ఏం లాభం? నాది బానిస బ్రతుకు కదా! పంజరపు బ్రతుకు కదా?—మళ్ళీ ఏం అంటు



Bensons-2141 TEL

· ే చూడు—నా కోసం—నా కోసం నా దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

నాకోసం కాదు—మీ కోసం—మీ కోసం...." ఇంక ఆపైన మాట్లాడలేక పోయాను. దిండులో తలదూర్చి ఏడుస్తూ పడుకున్నాను

ఆ తర్వాత బాబుకు పోతపాలు పడలేదు. వాంతులు. విరోచనాలు అయ్యాయి. జ్వరమొచ్చింది. బొద్దుగా బంతిలాగా వుండేవాడు చిక్కిపోయాడు. తర్వాత డాక్టరు సలహామీద బాబుకు పాలు ఇవ్వటానికి యీ సీతమ్మను కుదర్చటం జరిగింది. రోజూ మూడు పూటలా సీతమ్మ వచ్చి బాబుకు పాలిచ్చి పోతుంది. మిగతా వేళల్లో ఏ ఫారెక్సో, గ్లూకోజు నీళ్ళో పట్టుతాము.

తర్వాత తర్వాత సీతమ్మ బాబుకు పాలివ్వటానికొచ్చినప్పుడల్లా నా మనస్సు పడే చిత్రవధ, నా గుండెల్లోని కోత, మూగగా ఏడ్చే నా హృదయ బాధ వగవారికి కూడ వద్దని భగవంతుని ఎన్నో సార్లు రెండు చేతులూ జోడించి ప్రార్థించాను

బాబును మొదట్లో నేను ఎత్తుకున్నప్పుడల్లా వాడు పాలకోసం నా పమిట చెంగుని ఆ బుల్లి చేతులతో లాగి పారేసి నా వక్షస్థలంకేసి వాడి మొగాన్ని రాస్తూ ఆ బుల్లినోరును తెరచి "ఆ. ఆ" అని అన్నప్పుడల్లా నా నవనాడులు కృంగిపోయేవి. ఎందుకురా నాయనా అంత కవ్వర్లాడి పోతున్నావు? ఏమి కావాలనిరా? అలా దేవుల్లాడుతున్నావు? నా దగ్గర ఏముందిరా? నీ ఆకలి తీర్చేపాలు నా దగ్గర లేవురా? రాతి బొమ్మనురా తండ్రీ! కావాలంటే నా రక్తాన్ని బొట్లు బొట్లుగా రాలుస్తాను. కానీ నీ గొంతు తడిపే పాల చుక్కలను రాల్చలేని పాపిష్టిదాన్నిరా అని నాలో నేను కుమిలిపోయేదాన్ని.


చిన్నప్పుడు మేము బొమ్మలాట లాడుకునేటప్పుడు నేను 'అమ్మ'లాగా పమిట వేసుకొని చెక్కబొమ్మను వళ్ళో పెట్టు

కార్టూన్స్

● కార్టూనిష్టులకు ప్రత్యేకం.

'జ్యోతి'కి పంపే కార్టూనులు యిండియన్ ఇంక్‌తో వేసినవే అయి వుండాలి. అలా కాని పక్షంలో స్వీకరించబడవు.

—మేనేజర్.



కొని పాలిస్తున్నట్టుగా ఆడుకున్న ఆ ఆట లన్నీ నాకు మనోఃఫలకం మీద ప్రతి బింబించేవి. నా మనస్సు తూట్లు తూట్లు పడేది. అప్పుడు చిన్నప్పుడు వుత్త బొమ్మ లకు వుత్తిత్తి పాలు యిచ్చాను. తీరా యిప్పుడు నిజంగానే నా పిల్లవాడికి పాలివ్వ వచ్చేసరికి నేను వుత్త ప్రాణం వున్న బొమ్మనయి పోయాను. అదే విచిత్రం!

బాబు ఈ మధ్య సీతమ్మను చూడగానే గుర్తు పట్టి, తనకు పాలిచ్చే తల్లి వచ్చిం దన్నట్లు కేరింతలు కొట్టుతున్నాడు. నన్ను పరాయి మనిషిని చూచినట్లు చూస్తోన్నాడు. ఇది తలచుకొంటే నా గుండెలు బ్రద్దలవు తున్నాయి సీతమ్మను చూచి ఈర్ష్యపడే దాన్ని. సీతమ్మ నల్లగా, లావుగా చింత మొద్దులాగా వుంటుంది. ఈ మనిషా నా బంగారు బాబుకి పాలిచ్చేది? ఈ 'మురికి మనిషి' వంట్లోంచి వచ్చే ఆ 'మురికి పాలు' నా బాబు త్రాగుతున్నాడా అని అసహ్యించుకునేదాన్ని. కాని, తర్వాత తర్వాత ఆమె పాలే నా బాబుకు జీవధార అని, పాపం ఆ సీతమ్మను అసహ్యించు కోవటంలో అర్థంలేదని, నన్ను నేను సమాధాన పరచుకోవటం అలవరచు కున్నాను. సీతమ్మను చూచినప్పుడల్లా నానాగడ్డితిని, బురదల్లో, గుంటల్లో పండు కొని యీ మనుషుల చేతుల్లో తన్నులు తింటూ కూడ, మళ్ళీ వాళ్ళకే పాలధారలు కార్చే గేదెలు, ఆవులు గుర్తుకొస్తాయి. అలాంటప్పుడు సీతమ్మ యెడల నా మన స్సంతా కృతజ్ఞతాభిమానాలతో నిండి పోతుంది. ఒక విధంగా సీతమ్మ నొక విధమైన పూజ్యభావంతో చూడటం అల వరచుకున్నాను. నా బ్రతుకింతే అని సమాధాన పడటం కూడ నేర్చుకున్నాను.

అయినా, అప్పుడప్పుడు పాలకోసం బాబు ఏడ్చే ఏడ్పువిని చూసి. ఆ ఏడ్పును మాన్ప లేని నా చేతకానితనానికి ఇలా కుమలటం. కుళ్ళటం తప్పటం లేదు.

* * *

నేనిలా ఆలోచిస్తూ సోఫాలో కళ్ళు మూసుకొని వుండగా ఆయన కంపెనీ నుండి వచ్చారు. నన్ను చూడగానే ఆయన మహదానందంతో పొంగిపోయారు—మిస్ రీటా నేర్పుతో చేసిన మేకప్ చూసి.

"యు, రియల్లీ లవ్‌లీ రత్నా!'' అని తెగ మెచ్చుకున్నారు. ఒక జీవం లేని నవ్వు నవ్వాను. మనస్సును రాయిని చేసు కున్న ఆడది ఇంకేం చెయ్యగలదు?

తర్వాత, మా ఇంపాలాకార్లో పార్టీ కెళ్ళాం. పార్టీలో అందరి కళ్ళూ నామీదనే వున్నాయి.

మిష్టర్ మెహతాకు నన్ను పరిచయం చేశాడు నా భర్త. మిష్టర్ మెహతా ఈరోజు వుదయమే బొంబాయి నుండి వచ్చారు. ఆయన కోటికి పడగలెత్తే ధన వంతుడు.

మెహతా నన్ను గుచ్చి గుచ్చి చూస్తూ ''మిష్టర్ రావూజీ. మీకీ మధ్య బాబు పుట్టాడు అన్నారు కదూ!'' అని అడిగాడు నా భర్తను.

ఔను అని ఆయన తల ఆడించేరు.

''నో, ఐ డోంట్ బిలీవ్!''

"వాటీస్ రాంగ్ విత్ యు!'' నా భర్త అర్థంకాక అడిగాడు అమాయకంగా.

మెహతా పకపక నవ్వారు. "ఐ వర్స్ రైజ్-మిసెస్ రావు ఈజ్ సో ప్రెష్ అండ్ సో ఛార్మింగ్—'' అని అంటూ అతను తన చూపులను నావక్షసీమమీదకు ప్రసరింపజేశాడు.

మెహతా ఏ వుద్దేశ్యంతో అన్నది నా భర్త అర్థం చేసుకున్నాడు, అర్థం చేసు కున్నాక వుత్సాహంతో పొంగిపోయాడు. కిసకిస నవ్వాడు.

మెహతా మళ్ళీ అన్నాడు—''మిష్టర్ రావ్ మిమ్మల్ని చూస్తుంటే నిజంగా నాకు అసూయగా వున్నది. ఎనీ హౌ మై కంగ్రా చ్యులేషన్స్'', తన పాడు చూపులను నా వక్షోజాలమీదనుంచి మరల్చకుండానే.

యీసారి మొగం మతాబాలాగా వెలిగి పోయింది. "థాంక్యూ. థాంక్యూ'' అంటూ పొంగిపోయారు.

నాకయితే అరికాళ్ళలోంచి వణుకు బయలుదేరింది. నేను నిలువునా దహిం చుకు పోతున్నట్లుంది. వాడి అసభ్యమైన చూపులు నామీద నైట్రిక్ ఏసిడ్ చిమ్ము తున్నట్లనిపించాయి.

మెహతాగాడి లాటి వెధవల వెధవ చూపులను అకట్టుకోవటానికి. ఇలాటి నీచుల ఇట్టి మురికి అభినందనలను అందు కోవటానికన్న మాట నా భర్త నేను తాజాగా, నలగని పువ్వులాగా వుండాలని తహతహ లాడింది. నన్ను ఒక 'బొమ్మ'ను చేసి వెంట త్రిప్పుకుంటున్నది. నా కన్నబిడ్డకు నన్ను పాలిచ్చుకోనీయ కుండా చేసింది. ఇందుకన్న మాట!

ఇదీ నాగరికత! భగవాన్!